• ఉద్యమ సారథికి బర్త్‌డే శుభాకాంక్షలు



కేసీఆర్ బర్త్‌డేను పురస్కరించుకుని ఎర్రవల్లిలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

# నేడు కేసీఆర్ బర్త్‌డే వేడుకలు

- తెలంగాణభవన్‌లో భారీగా ఏర్పాట్లు
- కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన డాక్యుమెంటరీ ప్రదర్శన
- పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు
- 71 కిలోల కేక్ కటింగ్, పండ్ల పంపిణీ
- అన్నదానం, మొక్కలు నాటడం.. ఏర్పాట్లను పరిశీలించిన తలసాని



కేసీఆర్ పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, తెలంగాణ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు కవిత, వెంకటేశ్, కిశోర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా తన ఆధ్వర్యంలో కేసీఆర్ బర్త్‌డే వేడుకల నిర్వహణకు భారీ ఏర్పాట్లుచేస్తున్నట్టు చెప్పారు. ఈ వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, పార్టీ నాయకులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లను మాజీ మంత్రి మహమూద్ అలీ, తెలంగాణభవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో తలసాని మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు కేసీఆర్ జన్మదిన వేడుకలు ప్రారంభం అవుతాయని చెప్పారు. తొలుత డప్పు కళాకారులు, గిరిజన వేషధారణలో నృత్యాల ప్రదర్శన, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని తెలిపారు. అనంతరం కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. ఆ తర్వాత కేసీఆర్ 71వ పుట్టిన రోజు సందర్భంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేయనున్నట్టు చెప్పారు.

### నేడు సామాజిక సేవా కార్యక్రమాలు

కేసీఆర్ జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. పెద్దఎత్తున మొక్కలు నాటుతామని చెప్పారు. పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కేసీఆర్ పేరున సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అనేక ప్రాంతాల్లో రైతులు వివిధ రకాలుగా కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని వెల్లడించారు. ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్, నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌గౌడ్, పార్టీ నేతలు విప్లవ్‌కుమార్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు కవితారెడ్డి, వెంకటేశ్, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు వద్దిరాజు జన్మదిన శుభాకాంక్షలు



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు స్వప్నాన్ని సాకారం చేసి 70 ఏండ్ల కలను నిజం చేశారని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని ప్రశంసించారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన వృక్షార్చనలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## ప్రతీ తండాలో కేసీఆర్ బర్త్‌డే

**సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ పిలుపు**



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తండాలను పంచాయతీలుగా మార్చి, 10 శాతం రిజర్వేషన్ పెంచి, సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికం చేసి, గిరిజనులను గుండెల్లో పెట్టుకున్న కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను అన్ని తండాలలో ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం కేసీఆర్‌ను సంజీవ్‌నాయక్ కలిశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంజీవ్ నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా తండాలలో అన్నదానం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తాననే వారికి.. కేసీఆర్ తమకు చేసిన సాయం గురించి ఎలుగెత్తి చాటాలని వెల్లడించారు. అలాగే కేకులు కట్ చేసి, తమ విశ్వాసాన్ని చాటి చెప్పాలని మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను కోరారు.

## పుడమి పులకరించేలా వృక్షార్చన

- కేసీఆర్ 71వ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం
- రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మొక్కలు నాటింపు
- బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలి
- మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 'గ్రీన్ ఇండియా చాలెంజ్' ఇప్పటికే అద్భుత ఫలితాలతో అప్రతిహతంగా కొనసాగుతున్నది. 2018 జూలై 27న 'హరా హైతో భరా హై' అనే నినాదంతో ప్రారంభమైన ఈ హరిత యజ్ఞంలో దేశవ్యాప్తంగా అనేక మంది సెలబ్రిటీలు, పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటాలని ప్రజలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. నేడు తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో 'వృక్షార్చన'కు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి సెల్ఫీ దిగి 9177916838 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సంస్థ కోరింది. ఇందులో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గాలు, పట్టణాల్లో వృక్షార్చనపై క్షేత్ర స్థాయిలో మాజీ ఎంపీ సంతోష్ కుమార్ అవగాహన కల్పించారు. పోస్టర్లు ఆవిష్కరించి వృక్షార్చనపై విస్తృత ప్రచారం కల్పించారు.

### హరిత తెలంగాణ సాధనే లక్ష్యంగా వృక్షార్చన

రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు 'గ్రీన్ ఇండియా చాలెంజ్' ఆధ్వర్యంలో చేపట్టిన వృక్షార్చనకు భారీ స్పందన వచ్చింది. నేడు కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని గ్రామస్థాయి నుంచి ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. హరితహారం కార్యక్రమంతో కేసీఆర్ గ్రామాలు, పట్టణాలను పచ్చ తోరణాల్లా మార్చగా.. అదే సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా నేడు 5 లక్షల మొక్కలు నాటేందుకు రంగం సిద్ధమైంది. కేసీఆర్ పుట్టిన రోజున చేపట్టే ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు.

# అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డి

- కులగణన శాస్త్రీయంగా చేపట్టాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



వేపలసింగారంలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 16 : ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి వారి ఆశలను వమ్ముచేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి ఆదివారం తమ సొంత ఖర్చుతో గ్రామానికి బహూకరించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా శిరీషాకొండారెడ్డి అంబులెన్స్‌ను బహూకరించడం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఢిల్లీ నుంచి రావాల్సిన నిధులను తీసుకురావడంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనను అడ్డుకోవడం కోసం రాష్ట్రంలోని జనాభాను తక్కువ చేసి చూపించే విధంగా కులగణన చేపట్టారని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కులగణన సర్వే చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వే శాస్త్రీయంగా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరిచి అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని, నేడు కాంగ్రెస్ పాలనలో అనాథగా మారిందని దుయ్యబట్టారు. మంత్రులు ఎవరికి వారు అందినకాడికి దోచుకుంటున్నారే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా పోయిందని విమర్శించారు. మళ్లీ కేసీఆర్ పాలన కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## బోగస్ సర్టిఫికెట్లతో గురుకులాల్లో అడ్మిషన్లు

**సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి**

హైదరాబాద్, ఫిబ్రవరి16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు ట్యుటోరియల్స్, గుర్తింపులేని పేరెంట్ సంఘాలు బోగస్ సర్టిఫికెట్లను సృష్టించి గురుకుల అడ్మిషన్లను పక్కదారి పట్టిస్తున్నాయని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. ఈఏడాది అడ్మిషన్లు తగ్గాయని వస్తున్న విమర్శలపై ఆమె స్పందించారు. గురుకులాల్లో ప్రవేశాలకు కుల, ఆదాయ, బోనఫైడ్ సర్టిఫికెట్లు ప్రాథమిక ప్రామాణికమని వివరించారు. కొన్ని ట్యుటోరియల్స్, గుర్తింపులేని పేరెంట్ సంఘాలు బోగస్ సర్టిఫికెట్లు సృష్టించి.. సీటు ఇప్పిస్తామని రూ. 20వేల నుంచి రూ. 50వేల వరకు అక్రమాలకు పాల్పడ్డాయని పేర్కొన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో బోగస్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్న పలు ట్యుటోరియల్స్ మూతబడ్డాయని తెలిపారు. అలాంటి వారే ఇప్పుడు దరఖాస్తులపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కానీ అది అవాస్తమని, ఈఏడాది దరఖాస్తులు పెరిగాయని వర్షిణి వెల్లడించారు.



## సమ్మర్‌లో ప్రత్యేక రైళ్లు

**కసరత్తు చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): వేసవి కాలం దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేసవికాలంలో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు రైళ్లను నడిపించేందుకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే దసరా, సంక్రాంతి వంటి పండుగలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. వేసవిలో ప్రయాణికుల కోసం అదనపు రైళ్లు ఏర్పాటు చేయడం మంచిదే కాని, టికెట్లపై అదనపు చార్జీలు వసూలు చేయడం సమంజసం కాదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. కాగా, చర్లపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, లింగంపల్లి స్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతామని అధికారులు పేర్కొన్నారు.

# మిగులు రాష్ట్రంగా అప్పజెప్పినం

**బీఆర్ఎస్ పాలన తర్వాత కూడా మిగులు బడ్జెటే • అప్పులతో రాష్ట్ర ప్రజల దశాబ్దాల కష్టాలు తీర్చినం: కేటీఆర్**

- రాష్ట్ర దశదిశను మార్చి తరగని ఆస్తులను సృష్టించినం
- 125 లక్షల కోట్ల అప్పుతో ఎన్డీయే సర్కార్ చేసిందేంది?
- మీరే అత్యధిక అప్పులు చేసి మాపై అభాండాలేస్తరా?
- ప్రతి బడ్జెట్‌లో నిధులివ్వని బీజేపీని ప్రజలు క్షమించరు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బీఆర్ఎస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బహిరంగ లేఖ



> సమైక్యరాష్ట్రంలో తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని, ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులే ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ సర్కార్ పదేండ్ల కాలంలో అప్పుగా తెచ్చిన ప్రతీ పైసాను పెట్టుబడిగా మార్చి తెలంగాణ నేలపై విప్లవాత్మకమైన మార్పు తెచ్చిన విషయాన్ని యావత్ దేశం చూసింది.
>
> - కేంద్రమంత్రికి లేఖలో కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): భారతదేశ చరిత్రలోనే అత్యధికంగా అప్పులు చేసిన బీజేపీ నేతలు తమపై అభాండాలు మోపడం తగదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవుపలికారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 14 మంది ప్రధానులు 65 ఏండ్లలో 56 లక్షల కోట్లు అప్పు చేస్తే.. పదేండ్లలోనే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఇంత పెద్దమొత్తంలో అప్పులు చేసిన బీజేపీ ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతిక హక్కేలేదని మండిపడ్డారు. తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపిన నాడు కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని స్పష్టంచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు 70 వేల కోట్ల వరకు అప్పు ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన తర్వాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పజెప్పామని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చులకనగా మాట్లాడటంపై మండిపడ్డారు. అసలు అప్పులకు మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని హితవుపలికారు. ప్రతి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులివ్వని బీజేపీని తెలంగాణ ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు.

### 125 లక్షల కోట్లతో ఏం చేశారు?

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో అప్పుగా తెచ్చిన ప్రతీ పైసాను పెట్టుబడిగా మార్చి తెలంగాణ నేలపై విప్లవాత్మకమైన మార్పు తెచ్చిన విషయాన్ని యావత్ దేశం చూసిందని కేటీఆర్ గుర్తుచేశారు. దశాబ్దాలుగా తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తిందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులే సాక్ష్యమని తెలిపారు. అప్పులు ఉన్నంత మాత్రాన ఒక రాష్ట్రాన్ని వెనుకబడినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదని హితవుపలికారు. తెచ్చిన అప్పులను దేనికోసం ఖర్చుపెట్టారనేదే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పదేండ్లలో తెచ్చిన రూ.125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పే పరిస్థితి లేదని విమర్శించారు. కానీ, దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అప్పుతో శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు నిర్మించామని తెలిపారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామికరంగాన్ని వెంటాడిన చిమ్మచీకట్లను శాశ్వతంగా పారదోలేందుకు భారీ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి, రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించిన విషయం తెలంగాణ సమాజానికి తెలుసని, వాటి ఫలితాలను రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారని వివరించారు.

### పసుపు బోర్డుకు పైసా ఇచ్చారా?

'బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ ఖజానా నింపే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దినందుకు రాష్ట్రానికి మీరిచ్చే బహుమానం ఈ అవమానాలేనా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు పైసా కూడా కేటాయించకుండా మాటలకే పరిమితం కావడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బోర్డు చైర్మన్‌కు కనీసం కూర్చోవడానికి కార్యాలయం కూడా ఇవ్వకపోవడం, పసుపు బోర్డు పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఫైరయ్యారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దుచేసిన ఐటీఐఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని పదేండ్లలో పదులసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం వినిపించుకోలేదని విమర్శించారు. దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలకు దశాబ్దం గడిచినా మోక్షం లేకపోవడం నయవంచన కాదా? అని ప్రశ్నించారు.

### బురదజల్లి తప్పించుకోలేరు

బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత ఖర్చులతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా వందశాతం ఇండ్లకు మంచినీళ్లిచ్చే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దామని కేటీఆర్ స్పష్టంచేశారు. దానిని కూడా జల్ జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చినట్టు కేంద్రం ఖాతాలో వేసుకోవడం విడ్డూరమని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెరిపించి యువతకు ఉపాధి కల్పించాలని పదేపదే విజ్ఞప్తిచేశామని గుర్తుచేశారు. అయినా, కేంద్రం వినిపించుకోకపోవడం ఆ ప్రాంత ప్రజల పట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కేంద్రంలో 11 ఏండ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాష్ట్రానికి దక్కిందేమీ లేదని ఫైరయ్యారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా ఎనిమిది పైసలు కూడా తేలేదని, వారి అసమర్థతను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నాటి అప్పులపై బురద జల్లి తప్పించుకోలేరని, బీజేపీ చేసిన తప్పులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని కేటీఆర్ హెచ్చరించారు.

### మీలా కార్పొరేట్ల రుణాలు మాఫీ చేయలేదే!

బీఆర్ఎస్ హయాంలో ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును కేంద్రం తప్పుగా చూపించే ప్రయత్నాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం మాదిరిగా తెచ్చిన అప్పులతో కార్పొరేట్ శక్తులకు చెందిన లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయలేదనే విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. పంటల దిగుబడిలో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి తెలంగాణ ఎదిగిందంటే దానికి ప్రధాన కారణం.. తెచ్చిన అప్పులతో సంపద సృష్టించే బృహత్తర కార్యక్రమాలు చేపట్టడమేనని స్పష్టంచేశారు. అటు కేంద్ర బడ్జెట్‌లో, ఇటు రైల్వే కేటాయింపుల్లో తెలంగాణపై బీజేపీ సర్కారు సవతి ప్రేమ కనబరుస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడు మండలాలను, లోయర్ సీలేరు విద్యుత్తు ప్రాజెక్టును లాక్కొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతు కోసిన విషయాన్ని తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని పేర్కొన్నారు. కేంద్రం ఖజానా నింపే తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇవ్వాలని, విభజన హక్కులను నెరవేర్చాలని డిమాండ్ చేసినందుకు కేంద్ర మంత్రి పియూష్ గోయెల్, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు.

> బీఆర్ఎస్ హయాంలో ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును కేంద్రం తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నది. తెచ్చిన అప్పులతో కేంద్ర ప్రభుత్వం మాదిరిగా మేము కార్పొరేట్ శక్తుల లక్షల కోట్ల లోన్లు మాఫీ చేయలేదనే విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తుపెట్టుకోవాలి.
>
> - కేంద్రమంత్రికి లేఖలో కేటీఆర్



# పట్టణాల్లో పడకేసిన పాలన

- నిధుల లేక మున్సిపాలిటీలు విలవిల
- గత నెలలో ముగిసిన పాలక మండళ్లు
- వెంటనే అమల్లోకి అధికారుల పాలన
- అభివృద్ధిపై దృష్టిసారించని అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులే విడుదల చేయడం లేదు. ఫలితంగా రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రాష్ట్రంలో (కొత్తవాటితో కలిపి) దాదాపు 155 వరకు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో ఒకటి రెండు మినహాయిస్తే మిగతా మున్సిపాలిటీలలో అభివృద్ధి కుంటుపడింది. ఏడాది నుంచి పట్టణ అభివృద్ధిలో భాగంగా కొత్త పనులు ప్రారంభించలేక పోవడమే ఇందుకు నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను పూర్తి చేయడమే లేదు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణం, విస్తరణ, మొక్కలు నాటడం, కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలు, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ వంటి పనులకు కూడా మోక్షం లభించడం లేదు. వాటికి నిధులు మంజూరైనా విడుదల చేయడమే లేదు. మరోపక్క ఈ ఏడాది జనవరి నెలాఖరులో మున్సిపాలిటీల వారీగా పాలక మండళ్ల గడువు ముగిసింది. వెంటనే ప్రత్యేక అధికారుల పాలనను సర్కారు అమలులోకి తెచ్చింది. పాలక మండలి లేకపోవడంతో అధికారులు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. అలాగే మున్సిపాలిటీల వారీగా చెత్త సేకరణ కూడా ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి చేతులు దులుపుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రకరకాల సర్వేలు నిర్వహిస్తున్నది. అందుకు సంబంధించిన పనులను మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై రుద్దుతున్నది. దీంతో సిబ్బంది మొత్తం సర్వే పనులకే పరిమితం అవుతున్నారు తప్ప పట్టణాల్లో సమస్యలను పట్టించుకోవడమే లేదు. రాష్ట్రంలో దాదాపు మూడు నెలలకు పైగా సర్వేల పేరుతో సిబ్బంది మొత్తాన్ని రోజువారీ విధులకు దూరంగా ఉంచారు. రీ సర్వేపేరుతో మళ్లీ ఈ నెల 16 నుంచి 28 వరకు మున్సిపల్ సిబ్బందిని సర్వేకే పరిమితం చేశారు. ఈ పరిస్థితుల్లో పట్టణాల అభివృద్ధి ఎలా సాధ్యమనేది ప్రశ్నార్థకంగా మారింది.

# పంటల బీమా ఏదీ?

మొదటిపేజీ తరువాయి...

పూర్తిచేసినట్టు తెలిపారు. దీంతోపాటు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. తద్వారా రైతులకు ఉచితంగానే పంటలబీమా అమలుచేస్తామని గొప్పగా చెప్పారు. అన్ని పంటలకు బీమా అమలు చేస్తామని, ఏ చిన్న సమస్య వచ్చి పంటలు పాడైనా.. వారికి పూర్తి పరిహారం అందిస్తామని తెలిపారు. ఇందుకు అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వ ఫసల్‌బీమా యోజనలో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చేరింది. దీంతోపాటు పలు బీమా కంపెనీలతో చర్చలు జరిపింది. గత యాసంగి సీజన్‌లో అమలు చేసేందుకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లింది. ఆ తర్వాత ఆ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పుడు ఈ విషయం గురించి ఎవరూ మాట్లాడటం లేదని తెలిసింది.

### నిధుల కొరతే కారణమా?

ప్రభుత్వం పంటల బీమా అమలు చేయకపోవడానికి నిధుల కొరతే ప్రధాన కారణమని తెలిసింది. పంటలబీమా అమలు కోసం ఏటా సుమారు రూ.3వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నిధుల కొరత ఉన్నదన్న సాకుతో ఈ పథకాన్ని పక్కనపెట్టినట్టు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం రైతుభరోసా పంపిణీ పూర్తిచేసేందుకే నానా తంటాలు పడుతున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో పంటలబీమా అమలు చేసే పరిస్థితి లేదని అధికారులు చెప్తున్నారు. 'ముందు రైతుభరోసా పంపిణీ చేయనివ్వండి ఆ తర్వాత పంటల బీమా పథకం గురించి ఆలోచిద్దాం' అంటూ వ్యవసాయ శాఖ ఉద్యోగి ఒకరు నిట్టూర్చడం గమనార్హం.

### రైతులకు దక్కని పరిహారం

రాష్ట్రంలో పంటలబీమా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు కరువు ఛాయలతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారు. గత వానకాలంలో భారీ వర్షాలు కురవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగింది. పంటలబీమా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటికే కరువు ఛాయలు మొదలయ్యాయి. పంటలు ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంటల బీమా ఉంటే.. రైతులకు ఆ మేరకు పరిహారం దక్కి ఆర్థికంగా కొంత ఊరట లభించేది.